ఎటు చూసినా చెత్తే..

త్వరలో రాజమహేంద్రవరానికి పుష్కరాలు రానున్నాయి. ఇప్పటి నుంచే నగరాన్ని ఎలా ఆధునీకరించాలి అనే అంశం పై ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారు. నిధులు ఎంత తేవాలి. వాటిని ఎలా ఉపయోగించాలి అనే అంశాలపై స్పష్టత కోసం పదే పదే మాట్లాడుతున్నారు. కానీ నగరంలో ప్రతి వీధి చెత్తతో దర్శనమిస్తోంది. ఈ పరిశుభ్రతను పట్టించుకోకపోవడం విచారకరం. నగరంలో ప్రధాన సమస్యగా ఉన్న దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

- నగరంలో పేరుకుపోతున్న చెత్త
- వీధి మూలలే డంపింగ్ కేంద్రాలు
- చెత్త సేకరణ వంద శాతం జరగడం లేదు
- స్వయంగా ఒప్పుకున్న కమిషనర్ కేతన్‌గార్గ్
- సమీక్ష సమావేశంలో సిబ్బందికి పలు ఆదేశాలు

సీటీఆర్‌ఐ: రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్లలో ఎక్కడ చూసినా చెత్తే కనిపిస్తోంది. నగరం మురికి కూపంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం ప్రజలకు రోగాలు తెచ్చిపెడుతోంది. నగరంలో 1150 మంది పారిశుధ్య కార్మికులున్నారు. వీరిలో 450 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉండగా మిగిలిన వారు అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తారు. చెత్త తరలించే వాహనాలు కార్పొరేషన్ చెందినవి 19 ఉన్నాయి. 2022లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్వయంభూ ద్వారా 80 చెత్త తరలించే వాహనాలను కార్పొరేషన్‌కి అందజేసింది. చెత్త ద్వారా వచ్చిన పన్నుతో నెలకి రూ.40 లక్షలు వాహనాలకి, డ్రైవర్లకి, ఇంధనానికి కార్పొరేషన్ చెల్లించేది. కాని కూటమి ప్రభుత్వం చెత్తపై పన్ను రద్దు చేసింది. వాహనాలకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కానీ నిధులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆ వాహనాలన్నీ మూలనపడ్డాయి. దీనితో కార్పొరేషన్ 19 వాహనాలతో చెత్తను తొలగిస్తున్నారు. దీని వల్ల నగరంలో చెత్త ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తోంది.

వీధి మలుపులో చెత్త డంపింగ్

పారిశుధ్య కార్మికులు ఉదయం వచ్చి చెత్తను తొలిగిస్తున్నారు. తరువాత ఇంటిలో, ఆఫీసులలో పేరుకున్న చెత్తను ఎక్కడ వేయాలో తెలియక చెత్తను తీసుకువచ్చి వీధి మలుపుల వద్ద వేస్తున్నారు. మళ్లి పారిశుధ్య కార్మికులు తిరిగి మరుసటి రోజు వరకు రావడం లేదు. దీంతో అక్కడ చెత్త పేరుకుపోయి పెద్ద డంపింగ్ కేంద్రంగా మారుతుంది. వీధిలోని ఆ చెత్తను చెల్లాచెదురుగా చేస్తున్నాయి. ఆ చెత్త గాలికి కాలువలలోకి చేరుతుంది. కాలువలో చెత్త పేరుకోపోవడంతో కాలువలోని మురుగునీరు రోడ్డుపైకి చేరుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ తదితరులు

చెత్త పాలసీ పరమ చెత్త..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో వలంటీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేవారు. దీంతో చెత్తను రోడ్లపై వేసే వారు కాదు. పైగా ఎక్కడక్కడ చెత్త డస్ట్‌బీన్లు ఏర్పాటు చేయడంతో స్థానికులు చెత్తను డస్ట్‌బీన్‌లో వేసేవారు. డస్ట్‌బీన్‌లో చెత్తను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు తొలిగించేవారు. దీనితో నగరం అంతా క్లీన్‌గా ఉండేది. పాత కమిషనర్ ప్రతి రోజు ఎదో ఒక డివిజన్ వెళ్లి ఆకస్మికంగా తనిఖీ చేసేవారు. దీంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండేవారు. వీధిలో చెత్త లేకుండా చూసేవారు. నేడు పర్యవేక్షణ కొరవడడంతో నగరం అంతా చెత్తే దర్శనమిస్తోంది. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం పారిశుధ్య అధికారులు, సిబ్బందికి పలు యాదేశాలు జారీ చేశారు.


47వ డివిజన్‌లో రోడ్డు మూలన వేసిన చెత్త


దానవాయిపేట గానుగ వీధిలో పేరుకుపోయిన చెత్త

దుర్గంధ భరితం

నగరంలో చెత్త పై నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టి సారించాలి. ఉదయం పూట మాత్రమే చెత్తను తొలగిస్తున్నారు. తిరిగి పేరుకుపోయిన చెత్తను మరుసటిరోజు తీస్తున్నారు. దీనితో చెత్త పేరుకుపోవడమే కాకుండా దుర్గంధభరితంగా మారుతుంది. ప్రతి రెండు పూటల చెత్త తొలగింపు జరగాలి.

– తాడేపల్లి విజయ్‌కుమార్, ఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

నగరాన్ని శుభ్రంగా ఉండాలి

తగినంత సిబ్బంది, వాహనాలు ఉన్నప్పటికీ ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరగడం లేదు. సిబ్బంది అందరూ వంద శాతం చెత్త సేకరణ దిశగా కృషి చేయాలి. నగరాన్ని శుభ్రంగా ఉండాలి. చెత్తను సక్రమంగా తొలగించాలి. చెత్త సేకరించే వాహనాలు రిపేరులో ఉంటే వాటిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలి. వాహనాల కదలికలకు సంబంధించిన రిపోర్టు ప్రతి రోజు సాయంత్రం అందించాలి. సీజన్ కానప్పటికీ అల్పపీడనాల మూలంగా అప్పుడప్పుడు భారీ వర్షాలు కురుస్తున్నాయి. అందువల్ల కాలువలలో పూడికలను ఎప్పటికప్పుడు తీసివేయాలి.

– కేతన్ గార్గ్, కార్పొరేషన్ కమిసనర్, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు


నియామకపు పత్రాలు అందజేస్తున్న డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖలో పని చేస్తూ మృతి చెందిన కుటుంబాలకు చెందిన వారికి కారుణ్య నియామకాల ద్వారా 15 మందికి కండక్టర్లుగా నియామకపు ఉత్తర్వులు అందజేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక బుధవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అమలాపురం, గోకవరం, రాజమహేంద్రవరం, రావులపాలెం, రాజోలు, ఏలేశ్వరం, కాకినాడ, రామచంద్రాపురం, తుని ఆర్టీసీ డిపోలు, జిల్లా కార్యాలయాలలో పని చేస్తూ వివిధ ప్రమాదాలతో పాటు, ఆకస్మిక, సహజ మరణాలతో పాటుగా మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అక్టోబరు 19వ తేదీన కారుణ్య నియామకాల కల్పనకు కమిటీ ద్వారా 16 మందిని కండక్టర్ ఉద్యోగం కోసం ఎంపిక చేసినట్టు తెలిపారు. వారిలో 15 మందికి కండక్టర్లుగా నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం, పర్సనల్ ఆఫీసర్, కె.రవి, రాజమహేంద్రవరం డీపీటీఓ కార్యాలయ సూపరింటెండెంట్ టి. మల్లేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కె.వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యూనియన్ బ్యాంకు సేవలు


బ్యాంక్ ఏటీఎంను ప్రారంభించిన ఆర్ఎం విశ్వేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర బ్యాకింగ్ సేవలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఎ.విశ్వేశ్వరరావు తెలిపారు. బుధవారం రాజమహేంద్రవరానికి సమీపంలో ఉన్న మునికూడలి, కాటవరం గ్రామాలలో కొత్తగా ఏటీఎం సదుపాయం కల్పించి ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెషిన్ ద్వారా అన్ని సమయాలలో ప్రజలు నగదు తీసుకొనే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ రంగారావు, యూనియన్ మేనేజర్ బీవీఎస్ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నోబెల్ ఆవిష్కరణపై పోస్టర్ ప్రజెంటేషన్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నోబెల్ దినోత్సవం సందర్భంగా నోబెల్ గ్రహీతలు–ఆవిష్కరణలు అనే అంశంపై పోస్టర్ ప్రెసెంటేషన్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు నోబెల్ దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ నోబెల్ గ్రహీతల ప్రత్యేక లక్షణాలను గుర్తు చేస్తూ విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన అధ్యాపకులు నరసింహమూర్తి, బేబీ నిర్మల, దుర్గ ప్రవీణ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకులు విద్యార్థులు కూడా పాల్గొని విజయవంతంగా ముగించారు.

ఖైదీ మృతి

కంబాల చెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఒకటో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన దాశరథి మహాపాత్ర (40) గత సెప్టెంబర్‌లో గంజాయి రవాణా కేసులో అరెస్టు అయ్యి జైలుకు వచ్చాడు. అతనికి మూర్ఛ, శ్వాసకోశ కోస సంబంధ వ్యాధులు ఉన్నాయి. జైలు ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. జైలు అధికారులు అతన్ని ప్రభుత్వానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహంపై కేసు

కంబాల చెరువు (రాజమహేంద్రవరం): బాల్య వివాహం చేస్తున్న ఇరుపక్షాల తల్లిదండ్రులు, వరుడిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ మేరకు వివరాల్లోకి వెళితే.. కర్ణాటకకు చెందిన మహ్మద్ కైఫ్ కోలమూరుకు చెందిన 14 ఏళ్ల బాలికను రాజమహేంద్రవరం రాజేంద్రనగర్ షాదీఖానాలో బుధవారం వివాహం చేసుకునేందుకు నిర్ణయించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు చైల్డ్ లైన్ సభ్యులు అక్కడికి చేరుకుని, వివాహం ఆపించి ఒకటో పట్టణ పోలీసులకు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు వివాహం ఆపి వరుడితో పాటు ఇరుపక్షాల తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు.

కందుకూరి స్ఫూర్తికి పునరంకితం కావాలి


కందుకూరి స్వగృహంలో తొలి వితంత వివాహం జరిపిన ప్రాంతంలో బొమ్మల కొలువు వద్ద శ్రీనివాస్ తదితరులు


ప్రిన్సిపాల్ కల్యాణిభగవతిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

సీటీఆర్ఐ: కందుకూరి వీరేశలింగం పంతులు సామాజిక సేవ స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పడమే కాకుండా వాటికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఎస్‌కేఆర్ ఉమెన్స్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్యాణిభగవతి పిలుపునిచ్చారు. ఎస్.కె.టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి ఆధ్వర్యంలో సంఘ సంస్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అతిథిగా పాల్గొన్న కల్యాణిభగవతి మాట్లాడుతూ కందుకూరి అంటేనే ఒక బ్రాండ్ అని, ఇక్కడ చదివిన ప్రతి ఒక్కరూ అదృష్టవంతులని తెలిపారు. ఈ సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రమణమూర్తి మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలు రూపుమాపడానికి సంస్కర్తలు అవసరం నేడు ఎంతైనా ఉందని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్య తరపట్ల సత్యనారాయణ తదితరులు కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ పి.వి.బి.సంజీవరావు, అధ్యాపకులు ఎంఎస్ ఫణికుమార్, జి.కోటమ్మ, కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వితంతు వివాహాలను ప్రోత్సహించి సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వీరేశలింగం పంతులు ధన్య జీవని ఆంధ్ర కేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. తొలి వితంతు వివాహం జరిపిన రోజును పురస్కరించుకుని బుధవారం దుకూరి జన్మ గృహంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సమితి అధ్యక్షుడు దేశ్ రెడ్డి బలరామనాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ సహాయ సంచాలకులు కే తిమ్మరాజు పురావస్తు శాఖ ఉద్యోగి మూసా, ఆంధ్రకేసరి యువజన సమితి సభ్యులు దూర్వాసులు సత్యనారాయణ గుడిపూడి సునీల్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థినులు

సీటీఆర్ఐ: ఇక్కడ చదువు అయిపోగానే ఎవరి దారి వారు చూసుకోకుండా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న పూర్వ విద్యార్థులు నిజంగా అభినందనీయమని కొవ్వూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.సునీత అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఏటా డిసెంబర్ 11వ తేదీన కందుకూరి దంపతులు తొలి వితంతు వివాహం జరిపించిన రోజున పురష్కరించుకుని పూర్వ విద్యార్థులు ఇక్కడ కలవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం తరుపున 100 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనాన్ని గత ఎనిమిదేళ్లగా క్రమం తప్పకుడా నిర్వహిస్తున్నారన్నారు. అంతే కాకుండా ఆసక్తి ఉన్న వారికి కుట్టుమెషీన్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నారన్నారు. దేశ విదేశాలలో ఉన్న పూర్వ విద్యార్థినులు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడం వల్లనే ఈ కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నాము అని కార్యదర్శి బి.చంటమ్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినుల సంఘ గౌరవ సలహాదారు టి.జె.రాధాదేవి, ఎస్ మేరీ పెరల్స్, సుధారణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం ఉంటేనే చంద్రన్న బీమా


మాసా రామజోగ్

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వ అరాచకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని దీనికి నిదర్శనమే డ్వాక్రా మహిళలను టీడీపీ సభ్యత్వాలు తీసుకుంటేనే చంద్రన్న బీమా వస్తుందని ఆర్పీల ద్వారా ఒత్తిడి తీసుకు వస్తుండడంతో ప్రజాస్వామ్యం మంట కలిసిపోతుందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మాసా రామ్‌జోగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పేదవారికి అనారోగ్యం వచ్చి మృతి చెందిన, ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి వచ్చే బీమా వర్తించాలంటే, వారు తప్పనిసరిగా టీడీపీ కార్యకర్తలు కావాలంటూ హుకుం జారీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది వ్యక్తికి రూ.100 చొప్పున టీడీపీలో సభ్యత్వ రుసుం చెల్లించి, పార్టీ కార్యకర్తలు అయితేనే బీమా వర్తిస్తుందని లేకుంటే బీమా రాదంటూ ఆర్పీలో మహిళలను భయభ్రాంతులకు గురించేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను బెదించి ఇంతటి దారుణానికి దిగజారిన కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనపై అన్యాయాన్ని నిలదీస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలన్నారు. ఎవరైనా స్వచ్ఛందంగా ప్రశ్నిస్తే నిరంకుశ అరెస్టులకు పూనుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు.

ఘనంగా రథోత్సవం


స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గౌరీశంకరుల రథోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయంలో భక్తులు స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని ప్రజలంతా సఖ, సంతోషాలతో ఉండేలా కాపాడాలని స్వామిని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపులు నేపథ్యంలో గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 12.30 గంటల వరకూ గాంధీపురం–3, శ్యామలనగర్, గోరక్షణపేట, శీలం నూకరాజు రోడ్డు, వేంకటేశ్వర జనరల్ మార్కెట్, సోమలమ్మా పుంత రోడ్డు, డైమండ్ పార్క్ ఏరియా, జీవ నగర్, మహాత్మా గాంధీ బట్టలు మార్కెట్ మొదలగు ఏరియాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు


రూరల్ తహసీల్దార్ జయసూర్యకుమార్

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో గురువారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు రూరల్ తహసీల్దార్ పి.వి.వి.జయసూర్యకుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేరులతో మాట్లాడుతూ గురువారం, శుక్రవారం కాతేరు గ్రామంలోను, 16న ధవళేశ్వరం, 17న శాటిలైట్‌సిటీ, 18న హుకుంపేట, 19న పిడింగొయ్యి, 20, 21న తొర్రేడు, 23న బొమ్మూరు, 26, 27న కోలమూరు, 28న రాజవోలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. రైతులు, ప్రజలు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయసూర్యకుమార్ తెలిపారు.

కడియంలో రేపటి నుంచి...

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి మొదలవుతాయని తహసీల్దార్ కే పోసిబాబు తెలిపారు. ఈ సదస్సుల్లో రెవెన్యూ సంబంధిత సమస్యలను నమోదు చేసుకుని, పరిష్కరిస్తామని ఆయన వివరించారు. 13వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దుళ్ల గ్రామ సచివాలయం–1 వద్ద రెవెన్యూ సదస్సు జరుగుతుందన్నారు. 17 మురమండ, 19న దామిరెడ్డిపల్లి, 21, 24 తేదీల్లో జేగురుపాడు, 26న వీరవరం, 31, జనవరి 2, 4 తేదీల్లో కడియం, జనవరి 7న వేమగిరి గ్రామాల్లో ఈ రెవిన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ తెలిపారు. ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

26న పీఎంపీ డే


డాక్టర్ ప్రదీప్‌ను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ఈ నెల 26వ తేదీన రాజమండ్రి ది రెడ్డీస్ ఫంక్షన్ హాల్లో ది పీఎంపీ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో పీఎంపీ డే వేడుకలకు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ప్రతి పీఎంపీ హాజరువ్వాలని పీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు పిలుపునిచ్చారు. బుధవారం కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి శాఖ సమావేశం మండల ఉపాధ్యక్షుడు కేవీఎస్ఎన్ రెడ్డి అధ్యక్షతన హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ది పీఎంపీ అసోసియేషన్ 62వ వ్యవస్థాపక దినోత్సవం రాష్ట్రం అంతా అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించనున్నామని, అందులో భాగంగా ఈనెల 26వ తేదీన రాజమండ్రిలో మన జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం జరిగిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో స్థానిక మెడిసేఫ్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ కె.ప్రదీప్ అత్యవసర పరిస్థితుల్లో పీఎంపీలు అందించే ప్రాథమిక వైద్యం గురించి వివరించారు. అనంతరం డాక్టర్ ప్రదీప్‌ను సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, మండల కోశాధికారి యు.ప్రసాద్‌బాబు, ఎ.సురేష్‌బాబు, సుంకర శ్రీనివాస్, కె.లక్ష్మీనారాయణ, బాబూజీ, సభ్యులు హాజరయ్యారు.

రిటైర్ పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలి

- 2025 జనవరి ఒకటో తేదీ తదుపరి మాత్రమే సమర్పించాలి
- జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణ



సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ అయిన ఫించనుదార్లు, కుటుంబ పింఛనుదారులు ప్రతి సంవత్సరం సమర్పించాల్సిన తమ లైఫ్ సర్టిఫికెట్ (వార్షిక ధృవీకరణ ప్రమాణపత్రం) 2025 జనవరి ఒకటో తేదీ తరువాత మాత్రమే సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి ఎస్.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు పింఛనుదారులు అవగాహన లేక ముందుగా లైఫ్ సర్టిఫికెట్ అందజేస్తున్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేసిన వాటినే పరిగణన లోనికి తీసుకుంటామని అని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డిసెంబర్ 31లోగా అందించవద్దని విజ్ఞప్తి చేశారు. జనవరి ఒకటో తేదీ తరువాత లైఫ్ సర్టిఫికెట్‌ను జీవన్ ప్రమాణ ద్వారా ఆన్‌లైన్‌లో అందించాలన్నారు. 2025 కి సంబంధించి లైఫ్ సర్టిఫికెట్ జనవరి ఒకటి తర్వాత మాత్రమే సమర్పించాలన్నారు. ఈ విషయాన్నీ ప్రభుత్వ పెన్షనదారులు గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టెక్నాలజీపై అవగాహన అవసరం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై క్రాంతికుమార్

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ముఖ్యంగా టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఎస్సై క్రాంతికుమార్ అన్నారు. బుధవారం బొమ్మూరులోని ఎంజేపీఏపీ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.నాగవేణి అధ్యక్షతన విద్యార్థినులకు సైబర్ నేరాలు, మహిళా చట్టాలు, డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై క్రాంతికుమార్ మాట్లాడుతూ వివిధ యాప్‌ల ద్వారా నేరగాళ్లు అనేక మార్గాల్లో మోసాలు చేస్తున్నారన్నారు. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లలో వ్యక్తిగత చిత్రాలను, వివరాలను పెట్టొద్దన్నారు. కొత్తకాల్స్‌ను నమ్మి మోసపోవద్దని, తెలియని వారితో చాటింగ్ ప్రమాదకరమన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపైన, మహిళా చట్టాలపైన, గంజాయి, డ్రగ్స్ తదితర అంశాలపై ఎస్సై క్రాంతికుమార్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోలీసు అధికారులు చెప్పిన విషయాలను అవగాహన చేసుకుని ప్రతి విద్యార్థిని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హుషారుగా 'యువ ఉత్సవ్'


పోటీలను తిలకిస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని, సమాజహితంగా వినియోగిస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'నన్నయ' వర్సిటీలో బుధవారం నిర్వహించిన 'యువ ఉత్సవ్' కార్యక్రమం యువతను ఉర్రూతలూగిస్తూ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ నేటి కాలంలో యువత సెల్‌ఫోన్లతోనే ఎక్కువ సమయాన్ని గడిపేస్తున్నారన్నారు. అదే సమయాన్ని కమ్యూనికేషన్ స్కిల్స్‌ని డెవలప్ చేసుకునేందుకు వినియోగిస్తే ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారన్నారు. వారిలో ఆ స్ఫూర్తిని కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, దేశంపై వారిలో భక్తిభావాన్ని పెంపొందించేందుకు కూడా ఇవి అవసరమన్నారు. స్వామి వివేకానందని స్ఫూర్తితో యువత పయనం సమాజహితంగా సాగాలనే ఆకాంక్షను వెల్లబుచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ యువ ఉత్సవ్‌లో భాగంగా భారత దేశం 2047 నాటికి ప్రపంచ దేశాలకు ఒక దిక్సూచిలా తయారుకావాలన్నారు. అందుకు యువశక్తి తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ సైన్స్ మేళా ఎగ్జిబిషన్ గ్రూప్, సోలో, పెయింటింగ్, పద్యాలు రాయడం, ఫొటోగ్రఫీ, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాలకు పోటీలు నిర్వహించామన్నారు. యూనివర్సిటీతోపాటు అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థుల స్పందన బాగుందన్నారు. ఈ పోటీలలో విజేతలైన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు